# ఓటీపీ చెప్పొద్దు.. ఏపీకే తెరవొద్దు

## • సైబర్ మోసాలను కళ్లకు కట్టేలా జేఎన్‌టీయూ విద్యార్థుల లఘుచిత్రాలు

ఈనాడు, హైదరాబాద్: సైబర్ నేరస్థుల బారి నుంచి సులభంగా ఎలా తప్పించుకోవాలన్న అంశాలపై జేఎన్‌టీయూ విద్యార్థులు రూపొందించిన లఘు చిత్రాలు ప్రశంసలు అందుకుంటున్నాయి. జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో ఇటీవల 'సైబర్ అవేర్‌నెస్' పేరుతో లఘు చిత్రాల పోటీ నిర్వహించగా... 37 చిత్రాలు పోటీపడ్డాయి. రెండు నిమిషాల నిడివి ఉన్న 'హనీ ట్రాప్' ప్రథమ బహుమతిని గెలుచుకుంది. సైబర్ నేరస్థులు నగదును బదిలీ చేసుకునే ప్రయత్నాలు, బాధితుల మనోభావాలు, చివర్లో పోలీసుల సాయం తీసుకోవడం వంటి దృశ్యాలు బాగున్నాయంటూ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ విద్యార్థులను అభినందించారు.




విద్యార్థులకు బహుమతుల పంపిణీలో అభిలాష బిస్త్, జేఎన్‌టీయూ అధికారులు

### బంగారం... నగదు.. నెల రోజుల్లో డబుల్ కావు...

సైబర్ నేరస్థులు ఎలా మోసం చేస్తున్నారు? వారు ఫోన్‌లో బెదిరిస్తే ఎలా సమాధానమివ్వాలన్న అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులు భిన్నమైన అంశాలను ఎంచుకున్నారు. రైతులు, నిరక్షరాస్యులు, విద్యార్థులు, కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు, లాటరీల ద్వారా డబ్బు వస్తుందని ఆశపడేవారు, బంగారం, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులతో నెలరోజుల్లో డబుల్ లాభం వస్తుందన్న అంచనాలున్న వారిని నేరస్థులు ఎంపిక చేసుకుంటున్నారు. పీఎం కిసాన్ పేరుతో రైతులను మోసం చేసే తీరుపై చిత్రాలను రూపొందించారు. వయోధికులను లక్ష్యంగా చేసుకుని పెట్టుబడులంటూ ఫోన్లు చేసి రూ.కోట్లు కొల్లగొడుతున్న తీరుపై మరిన్ని చిత్రాలను ప్రదర్శించారు. లఘు ఈ చిత్రాలను యూనివర్సిటీకే పరిమితం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పోటీలకు పంపనున్నామని జేఎన్‌టీయూ అధికారులు తెలిపారు.

### ప్రశ్నల రూపంలో ఆకట్టుకునేలా..

సైబర్ మోసాల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకులు నిర్వహిస్తున్న ప్రచారాలకు భిన్నంగా ఈ లఘు చిత్రాలను రూపొందించారు. ఓటీపీ చెబితే ఇలాంటి నష్టాలుంటాయి.. జాగ్రత్తలు తీసుకోండి అంటూ అధికారిక ప్రకటనలు, ప్రచారాల్లో ఉంటుండగా... "ఓటీపీ చెబితే ఏమవుతుంది" "ఏపీకే ఫైల్స్ తెరిస్తే ఎందుకు ఫోన్ హ్యాక్"అవుతుంది? అంటూ ప్రశ్నల రూపంలోనే చిత్రాలను చిత్రీకరించారు. ఓటీపీ చెప్పిన వెంటనే నగదు దోచుకునే తీరును, బాధితుల ఖాతాల్లో డబ్బు పోయాక వారి పరిస్థితులను హృద్యంగా మలిచారు. సైబర్ మోసాలకు అడ్డుకట్ట పడాలంటే 'వన్ టైమ్ పాస్‌వర్డ్(ఓటీపీ)' కీలకమని, ఓటీపీ చెప్పనంత వరకూ మన బ్యాంక్ ఖాతాల్లో నగదు పదిలంగా ఉంటుందని సైబర్ నిపుణులతో చెప్పించారు.